క్లుప్తంగా

2న శివాజీ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర

తెనాలి: ఛత్రపతి శివాజీ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర జూన్ 2న పట్టణంలో నిర్వహించనున్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమై.. పట్టణంలో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమపోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. శోభాయాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. శివాజీ స్మారక సమితి అధ్యక్షుడు మైలా హరికృష్ణ, సభ్యులు మంచాల రత్నరాజు, దుర్గారావు, లక్ష్మీనారాయణ, రామిశెట్టి గోపి, మణికంఠ, హరివెంకట్, తరుణ్ గోపి, బసవయ్య పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం

తెనాలి: ఏపీఎస్ ఆర్టీసీ, తెనాలి డిపో పరిధిలోని ఖాళీ స్థలాలను పదిహేనేళ్ల ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు ఓపెన్ టెండర్లు పిలిచినట్టు డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లకు సంబంధించి బిడ్డర్లతో మంగళవారం ఉదయం 11 గంటలకు డిపోలో సమావేశం ఉంటుందని, ఆసక్తి గల వారు హాజరుకావాలని తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలి: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉయం 11.30 గంటలకు సమావేశం సమావేశం జరుగుతుందని, అజెండాలోని 47 అంశాలను చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కాలపరిమితి పూర్తయిన మున్సిపల్ దుకాణాల లీజు గడువు రెన్యువల్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల విజ్ఞప్తుల మేరకు పలు వార్డుల్లో చేపట్టాల్సిన సీసీ డ్రెయిన్ల నిర్మాణం వంటి అంశాలను అజెండాలో పొందు పరిచినట్టు తెలిపారు. అలాగే పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల పై సమావేశంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం వలంటీర్ వ్యవస్థతోనే సాధ్యం

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్


వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ప్రతి ఇంటికీ సంక్షేమం అందించడం వలంటీర్ వ్యవస్థతోనే సాధ్యమైందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ క్యాలెండర్‌తో పని చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొనియాడారు. కొల్లిపర గ్రామంలోని పాలకేంద్ర కల్యాణ మండపంలో కొల్లి పరలోని 1, 2, 3, మున్నంగిలోని 1, 2, వల్లభాపురంలోని 1, 2, పిడపర్రు గ్రామంలోని సచివాలయాల వలంటీర్లను సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు ఎంపీడీవో పి.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా పేదలకు నిస్పక్షపాతంగా అందించాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మ భూమి కమిటీలు చెప్పిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు వర్తించేలా చేసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుతం సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో.. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. తెనాలి నియోజక వర్గం అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాష్ట్రంలోని టాప్ 10లో ఉందని, స్వయంగా సీఎం చెప్పినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా స్వయంగా తనకు తెలపాలని, అధికారులకు, ప్రజలకు చెప్పారు. పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో వలంటీర్లు మరింత బాధ్యతతో ఎటువంటి వివక్ష లేకుండా పనిచేయాలని చెప్పారు. అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం వలంటీర్లను సేవా వజ్ర, సేవారత్న , సేవా మిత్ర అవార్డులు ప్రదానం చేసి, సత్కరించారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నేటితో నాలుగేళ్లు పూర్తి కావటంతో మండలంలోని పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే శివకుమార్ దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర పాలకేంద్రం కల్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ స్వామి దేవాలయంలో నాయకులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైస్ ఎంపీపీలు బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, తెనాలి ఏఎంసీ చైర్‌పర్సన్ అవుతు సీత, మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు ఝాన్సీ, శ్రీలత, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, అవుతు పోతిరెడ్డి, పార్టీ నాయకులు భీమవరపు శివకోటిరెడ్డి, పిల్లి గంగాధర్, జొన్నల శివారెడ్డి, నెర్ల కుటుంబ రెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, ఎంపీడీవో పి.శ్రీనివాసులు, తహసీల్దారు నాంచారయ్య పాల్గొన్నారు.

వేసవి ముగిసేలోగా.. గృహ నిర్మాణాలు పూర్తికావాలి

తెనాలి: నియోజకవర్గంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణం మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశించారు. తొలి విడత నిర్మాణంలో ఉన్న గృహాలు వర్షాలు కురిసేనాటికి పూర్తికావాల్సిందేనని స్పష్టం చేశారు. గృహాల నిర్మాణం పురోగతిపై సోమవారం ఆయన సమీక్షించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, పర్యవేక్షకులతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు జరిగిన ప్రగతిని తెలుసుకున్నారు. పెదరావూరు, నేలపాడు, సిరిపురం, గోలిడొంక లే అవుట్‌లలో నిర్మాణాలను సమీక్షించారు. అధికారులు సమన్వయంతో గృహాల నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. వేసవి ముగిసేలోగా నిర్మాణాలు పూర్తిచేసి, లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, గృహ నిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావు, డీఈ రఫీ, ఏఈ పిచ్చయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. ఎక్కడా లేని విధంగా పార్టులు పార్టులుగా పార్టీ మేనిఫెస్టో విడుదల చేయడం విడ్డూరమని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన అంగలకుదురు గ్రామంలో సోమవారం నాలుగో రోజు నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ఇంటింటికీ తిరిగి, సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులతో మాట్లాడి.. గత నాలుగేళ్లలో అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాహుబలి, పుష్ప సినిమాలు లాగా మేనిఫెస్టోను పార్టులు పార్టులుగా చంద్రబాబు విడుదల చేయడం ప్రజలను మభ్య పెట్టడమేనని విమర్శించారు. 2014 ఎన్నికలకు ముందు రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ప్రకటించిన చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో రుణ మాఫీ చేయకుండా మోసం చేశారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందని ఇన్నాళ్లు చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులు విమర్శలు చేశారని, ఇప్పుడు అవే పథకాలు పేరు మార్చి చంద్రబాబు ప్రకటిచడం హాస్యాస్పదమన్నారు. జగన్ సంక్షేమం అందిస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందా..? మరి చంద్రబాబు అవే పథకాలు అందిస్తే రాష్ట్రం సింగపూర్ అవుతుందా..? అని ప్రశ్నించారు. అంగలకుదరు గ్రామంలోని పల్లె వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుందన్న కారణంతో గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేదని, తాను అధికారంలోకి వచ్చాక రోడ్లు వేసినట్లు తెలిపారు. గ్రామంలో రూ.21 కోట్లతో సంక్షేమ పథకాలను, రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు వివరించారు. 22 మంది నివేశన స్థలాలకు అర్జీ ఇచ్చారని, త్వరలో వారికి స్థలాలను కేటాయిస్తామని వెల్లడించారు. గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటిక త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నేతలు జగన్ మోహనరావు, కొండముది విజయ్, కిరణ్‌చంద్ర, చుండూరు గోపీ, నలుకుర్తి మధు, ఇతర పార్టీ నేతలు ఉన్నారు.

కాల్వల మరమ్మతులు చేపట్టండి

సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'కు అందిన అర్జీలు


అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వాణి

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పది అర్జీలు అందాయి. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ జిల్లా కార్యాలయ విధుల్లో ఉండటంతో డిప్యూటీ కలెక్టర్ వాణి, ట్రెనింగ్ డిప్యూటీ కలెక్టర్ సాయిశ్రీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పరిపాలనాధికారి డి.వెంకటేశ్వర్లు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కృష్ణాపశ్చిమ డెల్టాలో పంట కాల్వలకు మరమ్మతులు చేట్టాలని తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. వేసవిలో కాల్వలు, లాకు గేట్లకు చేపట్టాల్సిన మరమ్మతులను ఈ సీజనులో ఇప్పటివరకు ప్రారంభించనే లేదని అధికారులకు వివరించారు. సంఘ నాయకులు దరిశి శివకోటేశ్వరరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, రావూరి శివశంకర రావు, నారాయణం కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో చిత్ర పరిశ్రమకు ఊతం ఇవ్వాలి


దిలీప్‌రాజా

తెనాలి: రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తీసిన సినిమాలకు రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ నుంచి ఎలాంటి సబ్సిడీ అందనేలేదని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. తెనాలిలోని మా-ఏపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సంస్థ చైర్మన్‌గా పనిచేసిన అంబికా కృష్ణ నుండి ఇప్పటి వరకు రాష్ట్రంలో తీసిన సినిమాలకు సబ్సిడీ ఇవ్వలేదన్నారు. అలాంటప్పుడు రాష్ట్రంలో సినిమాలు తీసేందుకు దర్శక, నిర్మాతలు ఎందుకు ముందుకొస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన అనంతరం సినిమా పరిశ్రమ అభివృద్ధిపై ఎందుకింత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో తెలియటం లేదన్నారు. సినీ పరిశ్రమకు ఏదైనా మేలుచేస్తే చలనచిత్ర అభివృద్ధి సంస్థ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. విజయవాడ భవానీ ద్వీపంలో వైఎస్సార్ పేరుతో ఫిలిమ్ సిటీ ఏర్పాటుచేస్తే, ఆంధ్రలో పెద్ద హీరోల సినిమా షూటింగ్‌లు జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే కనీసం పది ఫ్లోర్లతో విశాఖలో పూర్తిస్థాయి స్టూడియోలు నిర్మించి నిర్మాతలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

కోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తెనాలి బాలాజీరావుపేటలో నివసిస్తున్న గుంటూరులోని కోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. బాలాజీరావుపేటకు చెందిన పాలమూరి కృష్ణకిశోర్ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో పని చేస్తుంటారు. ఇక్కడ అద్దె ఇంట్లో కుటుంబంతో ఉంటూ.. ప్రతి రోజూ విధులకు వెళ్లి వస్తుంటారు. నెల 27న శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, కుటుంబంతో కలసి ఊరు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి యజమాని కృష్ణకిశోర్‌కు ఫోన్ చేసి, అద్దెకు ఉండే పోర్షను తలుపులు తీసి ఉన్నాయని చెప్పారు. కృష్ణకిశోర్ వచ్చి చూడగా ఇంట్లో బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. వెంటనే త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు.

తలుపు గొళ్లెం చాకచక్యంగా తొలగించి, లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలో ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు, పావుకిలో వెండి వస్తువులు, రూ. 70 వేల నగదును అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. చోరీకి గురైన సొత్తు విలువ రూ. 2.70 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

తప్పించుకు తిరుగుతున్న జూదరులకు జైలు శిక్ష

తెనాలిరూరల్: పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కి.. ఆపై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. గతేడాది జూన్ 23న కఠెవరంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా జూదరులు పట్టుబడ్డారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు లంకే అజయ్‌కుమార్, కొండ లక్ష్మీనారాయణ కోర్టుకు హాజరుకాకుండా, పోలీసులను తప్పించుకు తిరుగుతున్నారు. వీరిని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు గుర్తించి అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పి. రాజశేఖర్ నిందితులకు ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించగా పోలీసులు రిమాండ్‌కు తరలించారు.